


# తల్లి మనసు

సోషియాలజీ డిపార్టుమెంటులో అబ్బాయిలూ అమ్మాయిలూ కూడా చాలా గ్లామరస్‌గా వుంటారు. ఏదైనా కొత్తదనం ప్రవేశించిందంటే అది ముందు వీళ్లలోనే అని చెప్పుకోవచ్చు. చూడ్డానికి అందంగా నాజూకుగావుంటూ సరదాగా సగానికి పైగా టైము కాంటీనులో గడుపుతూ కబుర్లు చెప్పుకునే యీ కుర్రాళ్ల హృదయాలు మటుకు నవనీతం లాంటివి. ఏదైనా చాకిరీ చేయివలసివస్తే, కలక్షనుకి తిరగవలసివస్తే నడుంకట్టి ముందుకు ఉరికేది వీళ్లే. అప్పుడే అనిపిస్తుంది — వేసే వేషాలకీ చేసే పనులకీ మనం ముడివేయకూడదని !

కె. రామలక్ష్మి

ఈ కుర్రగ్రూపులో ఓ నల్గురమ్మాయిలూ నల్గురబ్బాయిలూ వున్నారు. ఎప్పుడూ కలిసి తిరుగుతూవుంటారు. "ఏమిటి, క్లాసుల్లేవా!" అని కర్మచాలక ఏ ప్రొఫెసరేనా ఎదురైఅడిగితే "ప్రోజెక్టు పనిమీద తిరుగుతున్నాం" అంటారు— నవ్వుకుంటూ. "వెల్ వెల్" అంటూ ఆ ప్రొఫెసరు తలాడించక తప్పదు.

రోజూ వాళ్ళు పదకొండు గంటలప్పుడు టీకని క్యాంటీనుకేసి గుంపుగా నడుస్తూ వెళ్లేవేళ; ఓ ఏడెనిమిదేళ్ళ కుర్రాడు అడుక్కుందుకు సొట్టకాలు కుంటుకుంటూ వచ్చేవేళ.

రోజూ వాడికి తోచిందంతా అంతా యిస్తూనేవుండేవారు. ఆ కుర్రనాగమ్మ ముఖం వారిదయకు చింకిచేటంతఅయేది. ఎంత ఆత్రంగా పరుగెత్తి వచ్చేవాడో—

తిరిగి వెళ్లేటప్పుడు అంత నిదానంగా వెళ్లేవాడు

ఈ సంగతి గుంపులో సరళ కనిపెట్టింది. "లుక్! వాడెందుకంత యిదిగా వెడతాడు" అంది కుమార్‌తో.

కుమార్ ఓసారి తన గిరజాలజుట్టు ఝడిపించి "నా కర్థంకాదు" అన్నాడు—అందమైన తనకంటిఅద్దాలని తీసి తుడుస్తూ. దాంతో అంతా చర్చలో పడ్డారు.

"దీనికంత గొడవెందుకు? వాడినే అడిగితే తేలిపోతుందిగా?" అంది ఆదిలక్ష్మి.

ఆదిలక్ష్మి ఆ గ్రూపులోకి ఎలా చేరిందో- మనకి ఆశ్చర్యంగా వుంటుంది. తెల్లని చీర, తెల్లని రవికతో కొరడాలా అల్లిన జడతో— చాలా సింపుల్‌గా గంభీరంగా వుంటుంది. రంగురంగుల సీతాకోకచిలుకల మధ్య యింకా రూపాంతరం చెందని గొంగలిపురుగులాగా వుంటుంది — వారి మధ్య ఆదిలక్ష్మి. కాంటీను నుంచి తిరిగి వస్తుంటే— దూరంలో చెట్టుకింద నిలబడి వున్నాడు ముష్టికుర్రాడు. "వాడిని పిలుద్దాం" అంది సరళ.

జుట్టు ఎగురవేసుకుంటూ మెరుపులా పరుగెత్తింది మోతీ—వాడికోసం.


వాడి చేయిపట్టుకొని నెమ్మదిగా నడిపించుకొని వచ్చింది.

"ఎందాకండి," అంటూ హడలిపోతున్నాడు కుర్రాడు. ఎక్కువ డబ్బులిచ్చేశామని తిరిగి లాక్కుంటారేమోనని వాడి భయం.

"రా, నీతో మాట్లాడాలి" అంటూ, మొత్తానికి తీసుకువచ్చింది.

అంతా ఆ కుర్రాడితో కలిసి నిండుగా పూసి సువాసనలు వెదజల్లుతున్న గుల్‌మెహర్ చెట్టుకింద కూర్చున్నారు.

ఆదిలక్ష్మి వాడి భయం పోగొట్టి—అడిగింది.




"ఏం యింకా అలా నిలబడిపోయావు?" అని.

వాడిని అలా జాలిగా అడిగేసరికి దుఃఖం ముంచుకొచ్చింది. భోరున ఏడ్వడం మొదలుపెట్టాడు.

"చెప్పు ఫరవాలేదు!" అని బ్రతిమాలారు.

"మా అమ్మ వచ్చేదాక నేను అక్కడే వుండాలి," అన్నాడు వెక్కుతూ.

"ఎందుకు? డబ్బులిచ్చాంగా, ఏదైనా కొనుక్కుని తినగూడదూ?" అంది సరళ.

వాడు మళ్ళీ ఏడుపు లంకించుకొన్నాడు.

"మై గాడ్. వీడుట్టి క్రైబేబీలా వున్నాడు" అంది మోతీ.

"మీరుండండీ, నే టాకిల్ చేస్తాను" అంటూ ఆదిలక్ష్మి వాడిని సముదాయించింది.

"మీ అమ్మ అన్నం తెస్తుందా?" అడిగింది.

తల అడ్డంగా వూపాడు.

"మరెందుకు?" అనడిగింది సరళ.

"నేను ముష్టిఎత్తిన డబ్బులన్నీ తీసుకుందుకు వస్తుంది" అన్నాడు.

అంతా యీ సమాధానం విని బిక్కముఖాలు వేశారు.

"ఇంటికి తీసుకువెళ్ళి అన్నం వండిపెడుతాందేమో" అంది అనుమానంగానే సరళ.

"ముందా యిది చెప్పు. పొద్దుటే ఏం తిన్నావు?" అడిగాడు కుమార్.

"ఏం తినలేదు. 'కడుపునిండుగావుంటే ముష్టిఎత్తలేవు. నిన్ను చూసి ఎవరూ జాలిపడ' రంటుంది మా అమ్మ. అందుకే ఏం పెట్టదు," అన్నాడు. "మైగాడ్!" అంటూ చివాలున లేచి కుమార్ అక్కడ తోటమాలిని పిలిచాడు. "ఖాదర్ అర్జెంటుగా వెళ్లి ఓ టీ, ఒక బన్ను తీసుకురా" అని వాడిచేతిలో డబ్బులు పడేశాడు.

"మీరు ఉండేదెక్కడ" అడిగింది ఆదిలక్ష్మి.

"పెరంబూరు చివర. పొద్దున బస్సులో యీ బీచిరోడ్డులో దింపేస్తుంది. మధ్యాహ్నంగా తనూ వస్తుంది"అన్నాడు కుర్రాడు.

ఖాదర్ బన్ను, టీ తెచ్చిచ్చాడు.

కుర్రాడు మొదటిసారే సహం బన్ను కొరికాడు. ఆత్రంగా.

"నీ పేరేమిటి."

"వీరమణి" అన్నాడు నోటినిండా పెట్టుకునే. బన్ను తిని టీ తాగాడు. వాడి కళ్ళు కొంచెం మనిషి కళ్ళలా కన్పించాయి యిప్పుడు. వేటగాడు తరుముతున్న జంతువులా లేడు.

"మీ అమ్మ నీకు తిండిపెట్టనప్పుడు నీవు సంపాదించిన దాంట్లో ఎందుకు తినవు?" కోప్పడుతున్నట్టు అడిగాడు కుమార్.

"తింటే చంపేస్తుంది" అన్నాడు భయంగా వీరమణి.

"ఎలా తెలుస్తుంది ?" అడిగింది సరళ.

"తెలుస్తుందండీ,నా కాలు చూడండి" అని చూపెట్టాడు.

కుడికాలు మోకాలుదాకానే వుంది. అందుకే వాడు కుంటుతూ నడుస్తాడు.

"ఏమైంది నీ కాలుకి ?"

"బస్సు కిందికి తోసింది" అన్నాడు తొణక్కుండా.

"ఎవరు? మీ అమ్మా?" నమ్మలేనట్టు అడిగింది ఆదిలక్ష్మి.

"అవునమ్మాయిగారూ, యీ రోడ్డు మీదే డబ్బులు ఎక్కువగా సంపాదించొచ్చునని తోసేసింది." అన్నాడు.

"రామ! రామ! తల్లా అది?" అంది సరళ.

"నేను బొద్దుగా బాగుండేవాణ్ని బాబుగారూ. ముష్టి అడిగినా ఎవరూ నన్ను అంతగా పట్టించుకునే వాళ్ళుకాదు. "పో పోరా" అంటూ కసిరేసేవారు. అమ్మకి ఈ ఆలోచన మా పక్కింటిది చెప్పింది. ఆ రోజు అప్పుడే కదలబో తున్న బస్సుకిందకి జాగ్రత్తగాతోసింది. నే పడ్డానేగాని నా చెయ్యింకా దానిచేతి లోనే వుండిపోయింది. అంచేత బ్రతికి పోయాను. ఆ దినం అమ్మ చాలా సంపాదించింది. ఆస్పత్రిలో నాకాలు తీసేశారు. అప్పుడ్నుంచి అదనుకున్నట్టు జాలిపడి డబ్బును ఎక్కువే వేస్తున్నారు బాబూ" అన్నాడు తన కాలెలాపోయింది చెప్తూ.

"అందుకే అంత నిజాయితీగా డబ్బు తల్లికి అందిస్తున్నాడు" అంది సరళ.

"చూడు, ఈ రోజు నుంచి ఎక్కువ తిరక్కు. మేం మధ్యాహ్నం నీకు డబ్బులు వెయ్యం, అన్నం పెట్టిస్తాం" అన్నాడు మోహన్. వీరమణి ముఖం వికసించినంతసేపు పట్టలేదు ముడుచుకు పోడానికి! "మా అమ్మ డబ్బులివ్వక పోతే నన్ను చంపేస్తుంది" అన్నాడు.

"ఫరవాలేదు. మేం చూచుకుంటాంగా" అని భరోసా యిచ్చాడు మోహన్.

అంతా వీరమణిని వదిలి క్లాసులకని కదిలారు. అందరి మనస్సుల్లోనూ — అనుకోకుండానే వీరమణి తల్లిని చూడాలన్న కోర్కె మెదిలింది.

వీరమణి ఆదిలక్ష్మి బృందానికి దరిదాపు పెంపుడుకొడుకు అయ్యాడు.

వాడిబ్రతుకు ఎలా బాగుపరచాలన్నదే ధ్యాస అయిపోయిం దాబృందానికి. ఒకటికి రెండుచొక్కాలు తెచ్చారు. వాడి జుట్టు సాఫీగా కత్తిరించారు. వాడిని ఒక చక్కని అబ్బాయిగా చూడాలని తహతహలాడారు—అంతా.

కాని వీళ్ల దగ్గరవుతున్నకొద్దీ — వీరమణి వీళ్లని తప్పించుకు తిరగడం ప్రారంభించాడు. వీళ్ళంటే వాడికి భయం పట్టుకుంది.

''ఏం ? ఏమైంది నీకు ? మేమంటే నీకు భయం ఎందుకు?" అడిగారొకసారి

"మాఅమ్మ చంపేస్తోంది బాబూ నన్నొదిలేయండి" అంటూ బావురుమన్నాడు.

ఏడుస్తూనే చొక్కాఎత్తి వీపు చూపెట్టాడు. కమిలిపోయివుంది !

"డబ్బంతా తినేస్తున్నానని తన్నేస్తూంది బాబూ" అన్నాడు,

"నువ్వు ధైర్యంగావుండు. నీకు కాలు కూడ పెట్టిస్తాం మేం" అంది ఆదిలక్ష్మి.

వాడి ముఖంలో సంతోషం తాండవించింది. కాని అంతలోనే భయం అలుముకొంది.

"నన్నింక బ్రతికుండనియ్యదు బాబూ, నాకుకాలొద్దు"అన్నాడువీరమణి.

"నీ ముఖం. నీకు మేం కాలుపెట్టిస్తే ఆనందించేది మొట్టమొదట మీ అమ్మ. చూస్తూవుండు" అని ధైర్యంచెప్పారు.

అనుకున్నట్టుగానే జనరల్ఆస్పత్రిలో సంప్రదించి అంతా కలిసి కొంతడబ్బు పోగుచేసి వీరమణికో కాలు సిద్ధం చేయించారు.

అది ఫిట్ చేసేరోజున మోతీ వాళ్ల అన్నను బ్రతిమాలి కారు తీసుకొచ్చింది. వాడికి కాలుపెట్టినందుకు ఆదిలక్ష్మి బృందంఅంతా యింక ఎంత ఆనందించారో చెప్పలేం.

వాడు నెమ్మదిగా లేచి రెండుకాళ్లతో నడుస్తూంటే వారికంట నీరుతిరిగింది.

''ఎంత మంచిపనిచేశాం!'' అని వారిమనస్సులో తృప్తిఏర్పడంది.

వీరమణి నెమ్మదిగా నడుస్తూ తన కొత్తకాలు చూసి మురిసిపోతున్నాడు. వాడికి ఆకలిదప్పులుకూడా తెలియలేదు కాలువచ్చిన సంతోషంలో.

కాని ఏం లాభం ?

మర్నాడు క్లాసు కాన్సిలయి వదిన్నరకే ఆదిలక్ష్మిగాంగు బయిటకి వచ్చేసింది. కాంపౌండులోఉన్న గుల్మొహర్ చెట్టుకేసి అంతా ఒకసారే చూశారు— ఎప్పుడూ వీరమణి అక్కడే కూర్చుని వుంటాడు. కాని ఈపూట వాడక్కడ లేడు.

మోహన్ వెళ్ళి ఖాదర్ని అడిగాడు.

ఖాదర్ ముఖం దించుకున్నాడు.

"అటు పరుగెత్తాడు సాబ్!'' అంటూ వీధికేసి చూపెట్టాడు.

ఆత్రుతతో అంతా రోడ్డుదాటి బీచికేసి నడిచారు.

వీరమణికంటే వాడి కంచుకంఠం ముందు వినిపించింది వాళ్ళకి.

''అయ్యో! నాకాలు! నాకాలు!'' అంటూ అరుస్తూ కుంటుతూ తల్లివెనక పరుగెడుతున్నాడు.

''వెధవా, నీకో కాలుఒకటి! నాలుగు డబ్బులురాకుండా, కాలు కావాలేం? కాలు ... యింద ...యింద...తీసుకో'' అంటూ వెక్కిరిస్తూ సముద్రంకేసి పరుగెడుతోంది.

ఇసుకలో కుంటలేక ఏడుస్తూ "నాకాలు నాకాలు" అంటూ కూలబడ్డాడు వీరమణి. జబ్బశక్తికొద్దీ ఆ కాలు సముద్రంలోకి విసిరేసింది ఆ తల్లి.


తల కిందకొట్టుకుంటూ నాకాలు! నాకాలు అని దిక్కులు ప్రతిధ్వనించేలా ఏడుస్తున్నాడు వీరమణి.

ఈ దృశ్యంచూసి బొమ్మల్లాగా నిలబడిపోయారు ఆదిలక్ష్మిబృందం.

"ఛీ, ఏంమనిషి.'' అంది ఆదిలక్ష్మి.

ఒక్కమాటకూడా మాట్లాడకుండా వెనక్కితిరిగారు.

"వాట్! ఉదయాన్నే బీచికివెళ్లి వస్తున్నారా! టట్! టట్!" అంటూ నవ్వేరు — ఎదురొచ్చిన ప్రొఫెసర్ అబ్రహాం.




జరిగినదంతాచెప్పి "మేం యిది నమ్మలేం'' అన్నారు.

ప్రొఫెసరుగారు బాధగానే నవ్వేరు.

''నమ్మక ఏంచేస్తారు? అది బ్రతుకు లెక్కలపద్ధతి. మనం మార్చలేం." అన్నారు.

"ఎంత ఇదైనా ఆమె ఒక తల్లికాదా ప్రొఫెసర్? తల్లి మనస్సు వెన్న — అంటారు. తనబిడ్డలకై ప్రాణాన్నయినా యిస్తుందంటారు—యివన్నీ కథలేనా!" అడిగింది మోతీ.

"ఎస్ మైడియర్, అవన్నీ మిత్స్. పుక్కిటి పురాణాలు. బ్రతుకుపోరాటంలో తల్లీలేదు, తోడూలేదు. ఎవరి స్వార్థం వారిది." అన్నారు దళసరి కళ్లద్దాల వెనుక ప్రొఫెసరుగారి కళ్లకూడా నీటి పొర కమ్ముతున్నాయి.

ఇది జరిగాక వీరమణి బీచిరోడ్డుకి రాలేదు. మోహన్ యిక వుండబట్టలేక ఖాదర్ని అడిగాడు "వీరమణిని చూశావా?". అని.

"వాణ్ని వాళ్ళమ్మ సెంట్రల్లో వేసింది సాబ్" అన్నాడు... హోజ్లో చెట్లకి నీళ్లుపోస్తూనే. ఆదిలక్ష్మిబృందం మటుకు బయిటికి రాగానే — ఆ గుల్మొహర్ చెట్టుకిందకోసారి చూడ్డంమటుకు మానలేదు!!

